బస్టాండు ఉన్నా.. అవస్థలు

- పెచ్చులూడుతూ అధ్వానంగా మారిన ఆర్టీసీ బస్టాండు
- ప్రయాణికులకు నీడ కరువు
- ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిన వైనం

నాగిరెడ్డిపేట: మండలకేంద్రం గోపాల్‌పేటలో ఆర్టీసీ బస్సులు బస్టాండులోకి వెళ్లకపోవడం వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులను డ్రైవర్లు బస్టాండ్‌లోకి తీసుకెళ్లకుండా రోడ్డుపైనే నిలపడంవల్ల ప్రయాణీకులకు అవస్థలు తప్పడంలేదు. బస్టాండు పైకప్పు పెచ్చులూడుతోంది. దీంతో ప్రయాణికులు అక్కడ ఉండలేని పరిస్థితి నెలకొంది. దీంతో రోడ్డు పక్కనున్న హోటళ్లు, పాన్‌షాప్‌లతోపాటు ఇతర దుకాణాల వద్ద నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. సుమారు రెండేళ్ల క్రితం ప్రధానరహదారి నుండి బస్టాండ్‌లోకి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంత కారణంగా బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లడంలేదు. అప్పటినుండి బస్సులు ప్రధానరహదారిపైనే నిలపడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు మొదలయ్యాయి. దీనిని గుర్తించిన ప్రజాప్రతినిధులు, అధికారులు సుమారు 10నెలల క్రితం ప్రధానరహదారి పైనుండి ఆర్టీసీ బస్సులు బస్టాం డ్‌లోకి వెళ్లివచ్చే మార్గాన్ని లక్షల రూపాయలు వెచ్చించి సీసీ రోడ్డుగా మార్చారు. రోడ్డుపనులు పూర్తయి ఆరునెలలు గడుస్తున్నా నేటికీ బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లకుండా ప్రధానరహదారిపైనే నిలుపుతున్నారు. దీనివల్ల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలనుకున్న వారు గంటల తరబడి రోడ్డు పక్కనున్న చిరువ్యాపారుల దుకాణాల వద్ద మండుటెండలో నిరీక్షించాల్సి వస్తుంది. గత కొంతకాలంగా ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లకపోవడం వల్ల ప్రస్తుతం బస్టాండ్ ఆవరణ ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. లక్షలు వెచ్చించి బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన రోడ్డు ఆటోలకు నిలయంగా మారింది.



ప్రధాన రహదారిపై నిలిపిన బస్సులు

రోడ్డుపైనే బస్సులు..

ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లకుండా ప్రధాన రహదారిపైనే నిలపడం వల్ల ఆ ప్రాంతంలో తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. మెదక్, ఎల్లారెడ్డి వైపుల నుండి ఒకేసారి రెండుబస్సులు వచ్చి బస్టాండ్‌ప్రాంతంలోని ప్రధా న రహదారిపై నిలుపుతున్నారు. దీంతో ప్రధాన రహదారిపై నిలిపిన బస్సులు వెళ్లేవరకు ఇరువైపుల నుండి వచ్చే వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీనివల్ల బస్టాండ్‌ప్రాంతంలోని ప్రధాన రహదారిపై తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. మూడు దశాబ్దాల కిందట మండలంలోని గోపాల్‌పేటలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల సుమారు రూ.15లక్షలు వెచ్చించి బస్టాండ్ ఆవరణను సీసీగా మార్చారు. కానీ శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌ను మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. బస్టాండ్ పైకప్పు నుండి పెచ్చులన్నీ ఊడి కింద పడుతున్నాయి. దీంతోపాటు బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునే దిమ్మలు సైతం ధ్వంసమయ్యాయి. అయినా ఆర్టీసీ అధికారులు బస్టాండ్ మరమ్మత్తులను పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేలా చర్యలు చేపట్టి ప్రయాణీకులకు తగిన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



పెచ్చులూడిన ఆర్టీసీ బస్టాండ్ పైకప్పు

క్లుప్తంగా

వైకుంఠ రథం వితరణ



భిక్కనూరు: భిక్కనూరు సర్పంచ్ తున్కి వేణు తండ్రి నారాయణ, సోదరుడు శ్రీనివాస్‌ల జ్ఞాపకార్థం పంచాయతీకి రూ. 6.75 లక్షల విలువ చేసే వైకుంఠ రథాన్ని ఇచ్చారు. ఎంపీపీ గాలి రెడ్డి మాట్లాడుతూ వైకుంఠ రథాన్ని ఇవ్వ డం అభినందనీయం అన్నారు. ఉప సర్పంచ్ బోడ నరేశ్, ఎంపీటీసీ బాబు, మాజీ సర్పంచ్ నాగ భూషణంగౌడ్, వార్డు సభ్యులు బల్యాల సిద్ధ రాములు, భాను, చంద్రం, రవి, బాల్‌రాజు, సరస్వతి ప్రభాకర్ పాల్గొన్నారు.

27న జగన్నాథ రథయాత్ర

కామారెడ్డి అర్బన్: పట్టణంలో 27న జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాస్ తెలిపారు. ఈ సందర్భంగా రాత్రి వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాల కోసం 9959 602551 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆయుర్వేద మందు పంపిణీ



కామారెడ్డి అర్బన్: మృగశిర కార్తె సందర్భంగా గురువారం రాత్రి స్థానిక విద్యానగర్ శ్రీవిశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో పంచకర్మ ఆయుర్వేద వైద్యులు వెన్నెల రుద్రమణి దేవర ఆయుర్వేద మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జే.శివకుమార్, ప్రతినిధి టి.మోహన్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కుల అందజేత



నాగిరెడ్డిపేట: మండలంలోని ఆత్మకూర్, అచ్చాయపల్లి గ్రామాలకు చెందిన నల్ల పొశెట్టి, ఒడ్డె కుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ శుక్రవారం బీఆర్ఎస్ ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ కాశీ నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతమైన ఆలోచనలతో చదవాలి



రామారెడ్డి: ఉన్నతవంతమైన ఆలోచనలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మున్నూర్ కాపు సంఘం మండల అధ్యక్షుడు బండి ప్రవీణ్ పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన మున్నూరుకాపు కులానికి చెందిన పలువురు విద్యార్థులను శుక్రవారం మున్నూర్ కాపు సంఘం ఆధ్వర్యంలో మద్దికుంట గ్రామంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు తోట భూమయ్య, ప్రధాన కార్యదర్శి గోపు నర్సింలు, ప్రచార కమిటీ కార్యదర్శి బండి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వైద్య పరీక్షలు



లింగంపేట: మండలంలోని లింగంపల్లి (ఖుర్దు) గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామి కూలీలకు శుక్రవారం ఏఎన్ఎం రాజమణి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎండకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బడిబాట టీచర్లకు సెలవులు ఇవ్వాలి

కామారెడ్డి అర్బన్: బడి బాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు ఇవ్వాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులా ఒక ప్రకటనలో కోరారు.

మేస్త్రీ మృతి

కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో పాటు మద్యం తాగడం వల్ల ఉత్తరప్రదేశ్‌కు చెందిన మేస్త్రీ పిచోరియా రవి (38) శుక్రవారం అశోక్ నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద మృతి చెందాడు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. తెలంగాణ ఆర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తాడ్వాయిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్ర వారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక పలు రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. పేదల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. వెనుక బడిన తరగతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కింద ఆరుగురికి రూ. లక్ష చొప్పున పంపిణీ చేశారు. లింగంపేట మండలానికి చెందిన ఏడుగురి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, శాదీముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే తన సొంత ఖర్చుతో ఏడుగురి మహిళలకు పట్టు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆర్డీవో శ్రీను, ఎంపీపీ కౌడి రవి, జెడ్పీటీసీ రమాదేవి, వైస్ ఎంపీపీ నర్సింలు, తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో రాజ్‌వీర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, సర్పంచ్ సంజీవులు, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గొర్రెపిల్ల, గొంగడితో ఎమ్మెల్యే సురేందర్‌ను సన్మానిస్తున్న గొల్లకుర్మలు

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ గంగాధర్

బాన్సువాడ రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ ఇందూరు గంగాధర్ బహుమతులు అందజేశారు. ఉపన్యాస పోటీల్లో వినోద్, వ్యాసరచనలో నాగేశ్వరి, చిత్రలేఖనంలో రాజేశ్వరి, నృత్యంలో శ్వేత, రంగోలి పోటీల్లో గాయత్రి ప్రథమ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట్‌రావు, కృష్ణ,విఠల్, శ్రీనివాస్, బాలరాజు, రాజేష్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ బస్ ఆఫీసర్ల నియామకం



విలేజ్ ఆఫీసర్లతో బాన్సువాడ డీఎం సదాశివ్



విలేజ్ ఆఫీసర్లతో కామారెడ్డి డీఎం, ఆర్టీవో

బాన్సువాడ : బాన్సువాడ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న 35 మంది కండక్టర్లను విలేజ్ బస్ ఆఫీసర్లగా నియమించినట్లు డీఎం సదాశివ్ తెలిపారు. వారికి శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. డీఎం మాట్లాడుతూ సంస్థ ఎండీ సజ్జనార్, చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాల మేరకు విలేజ్ బస్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. వారు గ్రామాలకు వెళ్లి ప్రజలతో మమేకమై ఆర్టీసీ వల్ల కలిగే ప్రయోజనాలు, సంస్థ అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పిస్తారని అన్నారు. ఎస్సై దత్తాత్రి గౌడ్, సిబ్బంది బసంత్, సాగర్ పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ అభివృద్ధి కోసం గ్రామాల్లో ఆర్టీసీ ఆఫీసర్లను నియమించినట్లు కామారెడ్డి డిపో మేనేజర్ లక్కు మల్లేషం, ఆర్టీవో వాణి తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో వారికి అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు. శనివారం నుంచి వారు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఆర్టీసీ ఏఎస్ఎం మూర్తి, ఏఈ వసుందర, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మకు కన్నీటి వీడ్కోలు

భిక్కనూరు: స్వాతంత్ర సమరయోధుడు పెద్దబచ్చగారి బాగిరెడ్డి సతీమణి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహరెడ్డి తల్లి అన్నపూర్ణమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలతో గురువా రం ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ భిక్కనూరులోని ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి ఇంటికి వచ్చి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ గాలిరెడ్డి, నాయకులు నాగభూషణంగౌడ్, బస్వయ్య, మహేందర్‌రెడ్డి, నర్సింలు, నరేశ్, తున్కి వేణు పాల్గొన్నారు.

ఆకాంక్షలు నెరవేర్చకుండా ఉత్సవాలా?

లింగంపేట: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వానికి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించే నైతిక హక్కు లేదని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకుడు పరమేశ్వర్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన కేసీఆర్ క్రమబద్ధీకరించడంలో విఫలం అయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బాలరాజు, సహాయ కార్యదర్శి ప్రకాష్, నాయకులు నారాయణ, సాయిలు, రాములు, గంగమల్లు, గంగయ్య, బాలయ్య, గంగామణి, రూప్‌సింగ్, పోచయ్య, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

కాంగ్రెస్ సభ్యత్వ నమోదు

మద్నూర్: మండలంలోని గ్రామ గ్రామాన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు తమ్మెవార్ భగవాన్, నాగరాజు పేర్కొన్నారు. అంతాపూర్‌లో శుక్రవారం యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమం సందర్భంగా సభ్యత్వ నమోదు చేయించారు.

ఆధ్యాత్మికం

■ బీరప్ప ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



కామారెడ్డి రూరల్: మండలంలోని ఉగ్రవాయి గ్రామంలో బీరప్ప ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కురుమ సంఘ భవన నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

■ శబరి మాత ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో గురువారం రాత్రి పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు శబరి మాత ప్రతిమ, దివ్యసమాధి వద్ద వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ ఘనంగా బోనాల పండుగ



లింగంపేట: మండలంలోని కోమట్‌పల్లి, పర్మళ్ల, కొర్పోల్ గ్రామాల్లో శుక్రవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. అనంతరం బోనాలను అమ్మవారికి సమర్పించారు.

■ ఊర పండుగ ఉత్సవాలు



రాజంపేట: మండల కేంద్రమైన రాజంపేటలో ఊర పండగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్, సర్పంచ్ ఆముద సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

■ నేటి నుంచి పోశమ్మ ఆలయ ఉత్సవాలు



దోమకొండ: మండల కేంద్రంలోని పోశమ్మ ఆలయ ఉత్సవాలు శనివారం, ఆదివారం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు హాజరు కావాలని కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీకి హరిజన సంఘం ప్రతినిధులు బాల్‌రాజ్, నర్సింలు, తిర్మల్, ఏల్లయ్య, కిష్టయ్య, ధర్మరాజు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు రామస్వామిగౌడ్, మధు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాన్సువాడకే ఎక్కువ సంక్షేమ ఫలాలు

నస్రుల్లాబాద్: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గం ప్రజలకు ఎక్కువ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మన్‌దేవ్ పల్లి క్రాస్ రోడ్డులో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సంక్షేమ ఫలాల సంబరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలూ తెలంగాణ అభివృద్ధి వైపు చూస్తుంటే తెలంగాణ రాష్ట్రం మాత్రం బాన్సువాడ నియోజకవర్గం వైపు చూస్తోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు ఎక్కడా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడకు 11 వేల డబుల్ బెడ్రూం ఇళ్లు తెచ్చిన ఘనత స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, జెడ్పీ చైర్మన్ శోభ, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీపీ పాల్త్య విఠల్, జెడ్పీటీసీ జన్నుబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, నాయకులు, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, కిషోర్, ప్రతాప్, మాజీద్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం



వృద్ధుల సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాటిపల్లి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని తిప్పాపూర్‌లో వృద్ధుల సంక్షేమ సంఘం భవనం, పెద్దమ్మ దేవాలయం, రేణుకా ఎల్లమ్మ దేవాలయం ప్రహరీ, కాచాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఫంక్షన్‌హాల్, సిద్ధరామేశ్వర రెడ్డి సంఘం, ర్యాగట్లపల్లిలో రెడ్డి సంక్షేమ సంఘం భవనం, రామేశ్వర్‌పల్లిలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి, ముదిరాజ్ కల్యాణ మండపం నిర్మాణాలకు భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు బస్వరెడ్డి, రవీందర్‌రెడ్డి, గణేషరెడ్డి, నర్సింలు, బాబు, సిద్ధగిరి ఎక్‌నాథ్, బాల్‌లింగం, నరేందర్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

నాగిరెడ్డిపేట: విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాంను ఎంపీపీ రాజ్‌దాస్ శుక్రవారంమండల విద్యావనరుల కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన హెచ్ఎంలకు అందజేశారు. మండలానికి 22,150 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాజయ్య, క్రిష్ణస్వామితో పాటు పలువురు హెచ్ఎంలు పాల్గొన్నారు.

గాంధారి: విద్యావనరుల కేంద్రంలో ఆరో తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధాబలరామ్ నాయక్, ఎంఈవో సేవులా శుక్రవారం వివిధ పాఠశాలలకు చెందిన హెచ్ఎంలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంజీవు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ రాజ్‌దాస్

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

పెద్దకొడప్‌గల్: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని వడ్లం గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, దుస్తులతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని కొరాన్‌పల్లి తండా, గౌరారం గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెబుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంత్రి మధు సూదన్, సంధ్య రాణి, సంధ్య, అమూల్య, గంగారాం, సీఆర్పీ గోపాల్ పాల్గొన్నారు.



వడ్లంలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పేస్కేల్ అమలు చేయించాలి

కామారెడ్డి రూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేలు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా ఉపాధి ఉద్యోగ కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సాయిలుకు వినతి పత్రం అందజేశారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, రోస్టర్ విధానంలో ఎంపికైన తమకు పేస్కేల్ అమలు చేయించేలా కృషి చేయాలని జిల్లా జేఏసీ చైర్మన్ సరంపల్లి క్రిష్ణాగౌడ్ కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కల్పన, ధర్మారెడ్డి, హరిక్రిష్ణ, సాంబాజీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

సంక్షిప్తం

హుండీ లెక్కింపు

మద్నూర్: మండలంలోని హనుమాన్ ఆలయ హుండీని శుక్రవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఆదాయం రూ. 2,69,952 వచ్చినట్లు ఆలయ చైర్మెన్ తెలిపారు. మూడు నెలలకు ఒకసారి హుండీని లెక్కిస్తామని వెల్లడించారు.

పంట రుణాలు ఒకేసారి మాఫీ చేయాలి

ఎల్లారెడ్డిరూరల్: రైతుల పంట రుణాలను ఒకే విడతలో మాఫీ చేయాలని ఎల్లారెడ్డి సొసైటీ చైర్మెన్ నర్సింలుకు డైరెక్టర్లు సూచించారు. శుక్రవారం సొసైటీ పాలకవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం కోసం దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట: మండలంలోని కుల వృత్తుల వారు పనిముట్ల కోసం ప్రభుత్వం ఇవ్వనున్న రూ. లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. 18 నుంచి 55 ఏళ్లలోపు వయస్సున్న వారు మాత్రమే అర్హులని తెలిపారు.

ఉత్సవాలకు విరాళం

రాజంపేట: రాజంపేటలో కొనగసాగుతున్న ఊర పండగ ఉత్సవాలకు ఎన్ఆర్ఐ బల్ల ఆంజనేయులు ప్రకటించిన రూ. లక్ష ఆయన కుమారుడు బల్లసాయి తేజ ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు.

783 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 783 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరం అయిన 57 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 4,52,411 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 66,194 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో 99.05 లక్ష్యం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్

కామారెడ్డి క్రైం: బీఆర్ఎస్ యువజన విభాగం బీబీపేట మండల అధ్యక్షుడు బోదాసు సాయికుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంకె ముజీబొద్దిన్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడంతో సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

యువత రక్తదానం చేయాలి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా ఏరియా ఆస్పత్రిలో రక్త నిల్వలు నిండుకున్నందున యువతీ, యువకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయాలనుకునే వారు 9492874006 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న వ్యర్థపదార్థాల నుంచి కాపాడాలని కాచాపూర్ గ్రామంలో చేపట్టిన రిలే దీక్షలు 46వ రోజుకు చేరాయి. వేద పండితుడు విటల్ పంతులు దీక్షలో కూర్చొని మద్దతు ప్రకటించారు.

సైనిక్ స్కూల్లో ప్రవేశానికి అర్హత

కామారెడ్డి టౌన్: తమిళనాడులోని హాలిడే సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో స్థానిక ఎస్పీఆర్‌లో ఆరో తరగతి చదువుతున్న సంగెం హారిణి, బాశెట్టి మనస్విని అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మారుతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.